
# * గోవిందా...గోవింద!! *

రఘురాం ఓహో బ్యాంకులో క్లర్కుగా పనిచేసేవాడు. బ్యాంకు పరీక్షలన్నీ పాసయ్యి ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిపోయి ఇపుడు బ్యాంకు ఆఫీసరైపోయాడు. అతనికి తిరుపతిలోని ఓహో బ్యాంకు బ్రాంచికి పోస్టింగ్స్ ఇచ్చారు.




"ఆహాహా... చూశారా స్వామివారి మహత్యం!... మీకు ప్రమోషనిచ్చాడు..." అంది అతని భార్య తులసి కళ్ళు మూసుకుని పరవశంగా.

రఘురాం ఆశ్చర్యంగా భార్య వంక చూశాడు.

"మా జనరల్ మేనేజర్‌గారు వీరాస్వామని నీకెవరు చెప్పారు?"

"నేననేది మీ జనరల్ మేనేజర్ వీరాస్వామి గురించి కాదు... ఏడుకొండల స్వామి గురించి!.. నేను ఎన్ని మొక్కులు మొక్కుకున్నానో!!... నా పూజలు ఫలించాయ్. మీకు ప్రమోషన్ ఇవ్వడమే కాక మనల్ని తన సన్నిధికి తెచ్చుకున్నాడు స్వామి!... ఆహాహా..." కళ్ళు తెరవకుండానే అంది తులసి.

రఘురాం గుండె పీచుపీచుమంది.

"మొక్కులు అని అంటున్నావ్... కొంపదీసి నీ తలనీలాలు ఇస్తానని గానీ మొక్కుకోలేదు కదా? నిన్ను గుండుతో చూడలేను..."

తులసి పరవశం నుండి కోలుకోకుండా ఇంకా కళ్ళు మూస్కునే పకపక నవ్వింది.
"ఒక్క నా జుట్టన్నమాటేంటి.. మీది కూడా ఇచ్చేస్తానని మొక్కుకున్నా.." రఘురాం ఘొల్లుమన్నాడు.
"పాపమండీ.. అలా గోల చెయ్యకూడదు.. కళ్ళు పోతాయ్. జుట్టేగా... ఎంత మూడు నెలల్లో పెరిగిపోతుంది..." అంది తులసి కళ్ళు మూస్కునే.
ఏమో..ఎందుకొచ్చిన గొడవ అని చెంపలేస్కున్నాడు రఘురాం. "ఇక చాల్లే... కళ్లు తెరు... ఎవరైనా గుడ్డి రాస్కెల్ అనుకుంటారు..." అన్నాడు తులసితో విసుక్కుంటూ.
రఘురాం విజయవాడలో రిలీవ్ అయిపోయి తిరుపతిలోని ఓహో బ్యాంకు బ్రాంచిలో ఆఫీసరుగా జాయిన్ అయ్యాడు.
అక్కడ డ్యూటీలో జాయిన్ అయిన రోజు నుండి ప్రాణాలు తోడేయడం మొదలుబెట్టింది తులసి "మొక్కు తీర్చుకోడానికి ఎప్పుడెల్దాం..." అంటూ.. రఘురాం భార్యమీద విసుక్కున్నాడు.
"మొన్ననేగా ఇక్కడికి వచ్చాం. కొత్తగా ఆఫీసరుగా ఛార్జి తీస్కున్నా.. బోల్డంత పని ఉంది బ్యాంకులో.. నువ్వే చూస్తున్నావుగా రోజూ రాత్రి అయిపోతుంది ఇంటికి వచ్చేసరికి.. కాస్త తీరిక చిక్కనీ, రేపో ఎల్లుండో వెళ్దాం..."
"తప్పండీ... అలా తీరిక లేదని అనకూడదు.. కళ్ళు పోతాయ్. పనులు పక్కన పెట్టయినా మొక్కు తీర్చుకోవాలి... చెంపలు వేస్కోండి!..." అంది తులసి.
ఎందుకైనా మంచిదని రఘురాం చెంపలు వేస్కున్నాడు.
ఆ మర్నాడు బ్యాంకుకి సెలవు పెట్టాడు రఘురాం. ఉదయమే ఇద్దరూ కొండ ఎక్కడం మొదలుపెట్టారు.
"ఆహాహా.. స్వామి వారి మహిమ!... ఓహోహో... చూశారా ఎంత ప్రశాంత వాతావరణమో!!..." పరవశంతో కళ్ళు మూస్కుంది తులసి.
రఘురాం కాస్త ముందుకు వెళ్ళి చూస్కుంటే తనకూడ తులసి లేదు. వెనక్కి తిరిగి చూస్తే ఎక్కడో ఇరవై ముప్పయి మెట్ల క్రింద ఉంది. రఘురాం గబగబా మెట్లుదిగి వెనక్కి వెళ్ళాడు.
"ఏంటి ఇక్కడే నిలబడి పోయావ్?..." విసుక్కున్నాడు.
"కళ్ళు కనిపించడంలా... నేనేమో భక్తిపారవశ్యంతో కళ్ళు మూస్కున్నాగా...

కళ్ళు మూస్కుని మెట్లెలా ఎక్కను?..." విసుక్కుంది తులసి.
"సర్లే... అఘోరించు..." అని పక్కనున్న చెట్టుకొమ్మని విరిచి ఒక చివర తను పట్టుకుని రెండో చివర తులసి చేతికి ఇచ్చాడు.
ఇద్దరూ అలా మెట్లు ఎక్కుతుంటే ఒక ముసలాయన అన్నాడు:
"ఆమెకి కళ్ళు రావాలని వెంకన్న స్వామి దగ్గరకు తీస్కెళ్తున్నారా బాబూ? తప్పకుండా వస్తాయ్ బాబూ!..."
"నీ భక్తి పారవశ్యం మంటెట్టా... ఇహ ఆ కళ్ళు తెరు... అందరూ నిన్నో గుడ్డి గవ్వవని అనుకుంటున్నారు." గట్టిగా అరిచాడు రఘురాం అసహనంతో.
"తప్పండీ... అలా అనకూడదు.. కళ్ళు పోతాయ్!... చెంపలేస్కోండి..." అంది తులసి కళ్ళు మూస్కునే.
ఏమోలే... ఎందుకొచ్చిన గొడవ... వేస్కోపోతే ఏమౌతుందో ఏమో!! ... రఘురాం చెంపలు వేస్కున్నాడు.
"వేస్కున్నారా?.. నేను కళ్ళు మూస్కుని ఉన్నాను కదా! చెంపలేస్కున్నారో లేదో తెలీడం లేదు. కాస్త గట్టిగా నాకు వినిపించేలా వేస్కోండి..." అంది తులసి పారవశ్యంగా.
చెళ్..చెళ్.. "అబ్బా!... వేస్కున్నాను" పళ్లు కొరుకుతూ అన్నాడు రఘురాం.
తులసి తృప్తిగా నిట్టూర్చింది కళ్ళు మూసుకునే.
తరువాత ఇద్దరూ కొండెక్కి తలనీలాలు సమర్పించుకుని దేవుడి దర్శనం చేస్కుని దిగువ తిరుపతిలోని తమ ఇంటికి చేరారు.
ఆశ్చర్యం!...
వాళ్ళ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి.
"బాబోయ్.. మన ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయే. ఏ దొంగో దూరి మొత్తం దోచుకుని పోయినట్టున్నాడు..." కంగారుగా అన్నాడు రఘురాం.
"ఏదీ నాకు కనిపించదేం?..." అంది తులసి.
"ఎలా కనిపిస్తుంది గాంధారిలా..ఇంక కళ్ళు తెరు మనిల్లు వచ్చేసింది.. నీ పారవశ్యం మంటెట్టా.." రఘురాం మండిపడ్డాడు.
ఇద్దరూ కంగారుగా ఇంట్లోకి వెళ్ళారు.
ఇంట్లో సోఫాల్లో కూర్చుని ఇద్దరు మొగుడూ పెళ్ళాలు ఆకులకి సున్నం రాస్కుంటూ కిళ్లీలు చుట్టుకుంటున్నారు.

"ఎవరు బాబూ నువ్వు? చెప్పాపెట్టకుండా ఇంట్లో దూరిపోతావేం?" అన్నాడు అతను కోపంగా చూస్తూ.

"అసలు నువ్వెవరవయ్యా?... ఇది మా ఇల్లు" అన్నాడు విరుచుకుపడ్తూ రఘురాం.

అతను నాలుక కొరుక్కుని చెంపలేస్కున్నాడు.

"అరెరె.. మీరా రఘురాంగారూ.. సారీ అండీ!"

"ఇంతకీ మీరు లోపలికెలా వచ్చారు?"

"మామూలుగానే అండీ.. తాళం పగలుగొట్టుకుని వచ్చాం..."

"తాళం పగలగొట్టుకుని మా ఇంట్లో దూరడానికి మీరెవరండీ?..." కాస్త తేరుకున్నాక గయ్.. మన్నాడు రఘురాం.

"అరెరె... నా గురించి చెప్పలేదు కదూ...? మీ మేనమామ ఉన్నాడా?..." అన్నాడతను.

"ఉన్నాడనే అనుకుంటున్నా... అతని కొడుకా మీరు?... ఎప్పుడో చిన్నప్పుడు చూశాను. గుర్తుపట్టలేదు. సారీ..." అన్నాడు రఘురాం వినయంగా.

"అబ్బె. ఆయన కొడుకుని కాను... ఆయన కొడుక్కి ఒక స్నేహితుడు ఉన్నాడు."

"ఒక స్నేహితుడని అంటున్నారు మీరు కాదా?..."

అతనికి రఘురాం ఆతృత చూస్తే ముచ్చటేసింది. ఒకసారి రఘురాం బుగ్గ చిదిమి మళ్ళీ చెప్పసాగాడు:

"కాదు.. ఆ స్నేహితుడికి పెత్తల్లి కొడుక్కి పిల్లనిచ్చిన మాంగారి వేలు విడిచిన మేనమామ కొడుకు శివరాం అని ఉన్నాడు... ఆ శివరాంకి నేను ఫ్రెండుని!... నా పేరు సుబ్రమణ్యం... ఇది మా ఆవిడ పారిజాతం..."

"ఇదీ అదీ అని అంటున్నావ్. తిరుపతిలో అయితే కొట్టననా?.. పాపాలొస్తే వచ్చాయ్. చితగ్గొడ్తా అదీ ఇదీ అన్నావంటే..." అంది రుసరుసలాడ్తూ పారిజాతం.

"మీ గొడవ అలా ఉంచండి... మీరసలు ఎందుకొచ్చారూ.. మా ఇంటి తాళం ఎందుకు బద్దలుకొట్టారు?" రఘురాం పళ్ళు బిగపట్టాడు.

"ఏం లేదండీ... చాలా కాలంగా మేము తిరపతి వచ్చి ఏడుకొండలవాడి దర్శనం చేసుకోవాలని అనుకుంటున్నాం... దానికి తోడు మొక్కు కూడా ఉంది..."

"ఆ... ఉంటే?..." అసహనంగా అడిగాడు రఘురాం.
"మా శివరాంకి చెప్తే..."
"శివరాం ఎవడు?..." మళ్ళీ పళ్ళు బిగబట్టాడు రఘురాం.
"అదేనండీ.. శివరాం... మీ మేనమామ కొడుకు స్నేహితుడి పెత్తల్లి కొడుక్కి పిల్లనిచ్చిన మాంగారి వేలువిడిచిన మేనమామ కొడుకు అండీ శివరాం అంటే. అతనికి సంగతి చెప్తే మీ అడ్రసు ఇచ్చి మీ ఇంట్లో దిగమన్నాడు... మీరు లేరు కదా ఎంత సేపు చూస్తాం అని తాళం బద్దలు కొట్టాను" అన్నాడు సుబ్రమణ్యం.
"అతనికి మా అడ్రసు ఎక్కడిదీ?!!!" ఆశ్చర్యంగా అడిగాడు రఘురాం.
"భలేవారే... ఇలాంటి ముఖ్యమైన అడ్రసులు దగ్గర పెట్టుకోకుండా ఉంటారేంటండీ ఎవరైనా... బావగారు భలేవారే... హిహిహి..."
రఘురాం వెనక్కి తిరిగి చూశాడు. అక్కడెవరూ లేరు. "బావగారా?... ఎవరూ?..." అడిగాడు ఆశ్చర్యంగా సుబ్రమణ్యాన్ని.
"ఇంకెవరూ... మీరే... భలే చమత్కారులే..." వీపుమీద సర్దాగా గుభీమని గుద్ది సమాధానం చెప్పాడు సుబ్రమణ్యం.
ఆ రాత్రి రఘురాం వీపుకి వేణ్ణీళ్ళు కాపడం పెట్టుకున్నాడు
ఉదయం లేస్తూనే సుబ్రమణ్యం రఘురాంతో: "దేవస్థానం ఎక్కౌంటు మీ బ్యాంకులో ఉందటగా?... అందుచేత దేవస్థానం ఎగ్జిక్యూటివ్‌లు మీకు పరిచయం అటగా... అందుచేత మీరు ఉంటే దర్శనం త్వరగా అవుతుందటగా... అందుచేత మీరు ఇప్పుడు మమ్మల్ని కొండెక్కించి దైవదర్శనం చేయించాలి..." అన్నాడు.
రఘురాం మొహం వేలాడేశాడు.
"అన్నట్టు చెప్పడం మరిచా బావా... వచ్చేవారం మీ మేనమామ, ఆపైవారం శివరాం కుటుంబంతో సహా తిరపతి వస్తున్నారు. మీ ఇంట్లోనే దిగుతామని చెప్పమన్నారు..." అన్నాడు సుబ్రమణ్యం
అలా మొదలయ్యాయి. రఘురాం కష్టాలు. రఘురాంతో ఏమూలో చుట్టరికం కలుపుకుని వచ్చి ఇంట్లో దిగిపోతున్నారు. కొందరు బంధువుల దగ్గర్నుండి రికమెండేషను లెటర్సు తీస్కుని మరీవచ్చి దిగుతున్నారు ఇంట్లో. ఇతర ఓహో బ్యాంకు బ్రాంచీల్లో పనిచేసే వాళ్ళు కూడా తిరుపతికి వచ్చినప్పుడు ఇతని ఇంట్లోనే దిగుతున్నారు - అదేదో బ్యాంకు గెస్టు హౌసయినట్టు.

ఒక రోజు ఉదయమే ఒక వ్యక్తి వచ్చి రఘురాంని ఇలా అడిగాడు:
"ఏమండీ... రఘురాం ధర్మసత్రం అని ఇక్కడెక్కడో ఉందట... ఎక్కడ?..."

దాంతో వెర్రెత్తిన రఘురాం ఆరోజే హెడ్డాఫీసుకు ఒక లెటర్ వ్రాశాడు – తనని వెంటనే ఆ ఊరి నుండి బదిలీ చేయమని. వీలుగాని పక్షంలో తనకి ప్రమోషను వద్దనీ... క్లర్కుగా రివర్సు చేసేసి మళ్లీ విజయవాడకే ట్రాన్స్‌ఫర్ చేయమనీ...

* * *